క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఇబ్రహీం

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్తీలోని సీరాక్ పాఠశాల క్రీడాకారులు సుహాస్, కార్తీక సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇబ్రహీం తెలిపారు. క్రీడాకారులను ఆయన హెచ్‌ఎం వజీరా ఖాతూన్, వ్యాయామ ఉపాధ్యాయులు కొండెపోగు చిన్న సుంకన్నతో కలిసి శనివారం క్రీడాకారులను అభినందించారు.

గడియారం ఆసుపత్రిలో వసతులు కల్పించండి

కర్నూలు (టౌన్) : నగరంలోని పాతబస్తీలో ఉన్న గడియారం ఆసుపత్రిలో వసతులు కల్పించాని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.మురళీక్రిష్ణ అన్నారు. శనివారం స్థానిక నగర పాలక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎంతో చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బజారన్న, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో లక్ష్యం సాధించాలి

కర్నూలు (టౌన్): ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో లక్ష్యం సాధించాలని నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాల్‌లో నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణతో కలిసి రెవెన్యూ విభాగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ప్రణాళికలు రూపొందించుకుని పన్ను వసూలు చేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు జునీద్, ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు పేరుతో వేధింపులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు ఫీజుల పేరుతో విద్యార్థులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రైవేట్ ఇంజినీరింగ్, ఇతర టెక్నికల్ కాలేజీల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు. అయితే పర్యవేక్షణ చేయాల్సిన జేఎన్‌టీయూ విఫలమైందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నారాయణమ్మ (ఫైల్)

కర్నూలు (టౌన్): స్థానిక శ్రీరామనగర్‌లో నివసిస్తున్న జి.చిన్నపెంచలయ్య భార్య నారాయణమ్మ (56) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరు నెలల క్రితం వీరి కూతురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది.
అప్పటి నుంచి దిగులుగా ఉంటున్న నారాయణమ్మ.. శుక్రవారం ఆరోగ్యం బాగోలేదని, ఆసుపత్రికి వెళ్లి చూపించుకుని వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్త శనివారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహీంద్రా ఫైనాన్స్ కంపెనీకి మొట్టికాయ

కర్నూలు (లీగల్): రుణ బీమా పాలసీ కోసం రుణ గ్రహీత చెల్లించిన ప్రీమియం రూ.2 లక్షలను బీమా సంస్థకు సకాలంలో చెల్లించకుండా నిర్లక్ష్యం వహించిన మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్స్ కంపెనీని జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయ వేసింది. వివరాల్లోకి వెళ్తే... కర్నూలు పట్టణానికి చెందిన వీరభద్రా రెడ్డి మహీంద్రా ఫైనాన్స్‌లో రూ.16,20,000 రుణం పొంది హ్యుండయ్ కారు కొనుగోలు చేశాడు. తర్వాత ఆ ఫైనాన్స్ కంపెనీ సూచన మేరకు వీరభద్రారెడ్డి రుణ బీమా పాలసీ మంజూరు కోసం 2023వ సంవత్సరం ఆగస్టు-26న ప్రీమియం కింద రూ.2,00,986 చెల్లించి మరుసటి నెలలో అతను చనిపోయాడు. తర్వాత వీరభద్రారెడ్డి వారసులు సదరు కంపెనీ వారిని కలిసి వీరభద్రారెడ్డిపై ఉన్న రుణాన్ని రద్దు చేయమని కోరారు. అయితే మహీంద్రా ఫైనాన్స్ వారు అపట్లో పాలసీ ఇవ్వలేకపోయామని, ఫలితంగా రుణాన్ని రద్దు చేయడం కుదరదని చెప్పారు. దీనిపై రుణగ్రహీత వారసులు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారించిన కమిషన్ ప్రెసిడెంట్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్ మహీంద్రా ఫైనాన్స్ వాదనను తప్పుపడుతూ ప్రీమియం తీసుకున్న తర్వాత పాలసీ మంజూరు చేయాల్సిన బాధ్యత కంపెనీదేనని తీర్పు చెప్పారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

- కార్పొరేటర్లు తెలిపిన వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి
- దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి
- మునిసిపల్ అధికారులకు మంత్రి టీజీ భరత్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): నగర పాలక సంస్థ పరిధిలోని సమస్యలను సత్వరం పరిష్కరించాలని, ఇందులో కార్పొరేటర్లు తెలిపిన వాటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రి మునిసిపల్ అధికారులు, నగర పాలకసంస్థ కార్పొరేటర్లు, సచివాలయ అడ్మిన్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా సెప్టెంబర్ 30వ తేదీన నిర్వహించిన సమీక్షకు సంబంధించిన పనుల పురోగతిపై ఆరా తీశారు. కర్నూలు నగరంలో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రహదారుల అన్యాక్రాంతంపై ఉక్కుపాదం మోపాలన్నారు. రహదారుల నిర్మాణం, విస్తరణ పనుల్లో వేగం పెంచాలని, బంగారుపేట వెనుక రహదారి విస్తరణ పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గార్గేయపురం డంపు యార్డు వద్ద మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంటు నిర్మాణ పనులపై ఆరా తీశారు. పారిశుద్ధ్య తాత్కాలిక కార్మికుల పనితీరు, హాజరుపై పరిశీలన చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అర్బన్ డెవలప్‌మెంట్‌పై అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. టీజీవీ సంస్థల తరఫున కార్పొరేషన్‌కు ఉచితంగా హైపో ద్రావణాన్ని పంపిణీ చేస్తామన్నారు. మెడికల్ కళాశాల వద్ద మలుపులో ఉండే దుకాణదారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి అక్కడ రోడ్డు విస్తరిస్తామన్నారు. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వరకు రహదారి విస్తరణ పనులు చేపడతామన్నారు. సమావేశంలో కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవి కృష్ణ, ఆరోగ్యాధికారి కె. విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ

బాబా బృందావన్ నగర్‌లో ఏపీఎస్ఈబీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అసోసియేషన్ నాయకులు ఏర్పాటు చేసుకున్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహాన్ని మంత్రి టీజీ భరత్ ఆవిష్కరించారు.ఇంజినీరింగ్ అద్భుతం మోక్ష గుండం విశ్వేశ్వరయ్య అని, ఆయన జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకునేందుకు ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ భవన్ ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి చెప్పారు.

అయ్యప్ప మాలధారులకు వైద్యశిబిరం

కర్నూలు (హాస్పిటల్): జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం దూపాడులోని గోశాల వద్ద అయ్యప్ప మాలధారులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. హైదరాబాదు నుంచి శబరిమలకు రోడ్డు మార్గాన కాలినడకన వెళ్తున్న అయ్యప్ప మాలధారులకు శిబిరంలో ప్రథమ చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. వీరిని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, గురుస్వామి, కె.వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రమేష్ బాబు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి జె.రఘునాథ్‌రెడ్డి, కమిటీ సభ్యులు జి.శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

29న ఉషూ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 29న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల బాలికలకు ఉషూ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సి. హర్షవర్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అల్ట్రాసౌండ్ మిషన్లు విరాళం



అల్ట్రాసౌండ్ మిషన్లను వైద్యులకు అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అమెరికాలోని చికాగోలో నివసించే 1962, 1963 బ్యాచ్‌కు చెందిన కర్నూలు మెడికల్ కాలేజి పూర్వ విద్యార్థులు డాక్టర్ కృష్టారెడ్డి, డాక్టర్ అరుణ దంపతులు వారి మాతృమూర్తి పెన్నబడి గంగులమ్మ జ్ఞాపకార్థం రూ.30లక్షల విలువైన రెండు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ మిషన్లను శనివారం ఆసుపత్రిలోని గైనకాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాలకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గర్భిణులను కాన్పు సమయంలో దగ్గరికి వెళ్లి స్కానింగ్ చేయడానికి వీలుగా ఈ పరికరం ఉపయోగపడుతుందన్నారు. గుండెరేటు మార్పులు వచ్చినప్పుడు కారణాలు తెలుసుకోవడానికి దీనిని ఉపయోగిస్తారన్నారు. అలాగే రెండో మిషన్ ద్వారా క్యాజువాలిటీకి వచ్చే అత్యవసర రోగుల వద్దకు వెళ్లి స్కానింగ్ చేసే వీలుంటుందన్నారు. ఆర్ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉండే రోగులకు కూడా ఈ మిషన్ ద్వారా స్కానింగ్ చేసే వీలుందన్నారు. త్వరలో ఇన్‌ఫెర్టిలిటీ విభాగం అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రోగుల సహాయకుల విశ్రాంతి భవనం కోసం రూ.3 కోట్లు ఇచ్చేందుకు ఇద్దరు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారన్నారు. సెంట్రల్ ఫార్మసి కోసం రూ.1కోటి విలువ గల బిల్డింగ్ కోసం ప్రతిపాదనలను ప్రిన్సిపాల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ రామశివనాయక్, రేడియాలజి విభాగపు హెచ్ఓడీ డాక్టర్ రాధారాణి, డాక్టర్ హరినాథ్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్‌పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జాతీయ రహదారుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జాతీయరహదారుల నిర్మాణాలు, భూసేకరణ అంశాలపై జాతీయ రహదారుల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయరహదారి 44లో సఫా కాలేజీ నుంచి ఆత్మకూరు రోడ్డు, సూరత్-చెన్నై రోడ్డు, మంత్రాలయం బైపాస్ రోడ్డు, నగరి-జడ్చర్ల రోడ్ల భూసేకరణకు రైతుల వివరాలు పరిశీలించి నష్ట పరిహారాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. పెండింగ్ క్లెయిమ్స్‌ని త్వరగా పూర్తి చేయాలని, ఆర్బిట్రేషన్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. బి.తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులను నవంబర్ 15లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వీసు రోడ్డు కావాలని కొన్నిగ్రామాల ప్రజలు విజ్ఞాపనలు ఇస్తున్నారని, ఈ అంశంపై ఆ గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించి అండర్ పాస్ లేదా అనుకూలమైన విధంగా రోడ్డును ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నగరంలో రోడ్ల విస్తరణ పనులను మాస్టర్ ప్లాన్‌కు అనుకూలంగా చేపట్టాలని కమిషనర్ రవీంద్రబాబును ఆదేశించారు. సమావేశంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

జి.పుల్లారెడ్డిలో ముగిసిన జిజ్ఞాస

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజుల పాటు నిర్వహించిన సాంకేతిక ఉత్సవం జిజ్ఞాస-2కే24 శనివారంతో ముగిసింది. ఇండియన్ సొసైటీ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం ముగింపు కార్యక్రమంలో ప్రతిభ చూపిన వారికి జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన్ రావు ముఖ్య అతిథిగా ,ఆచార్య రంగ జనార్దన్ గౌరవ అతిథిగా హాజరై అవార్డులను ప్రదానం చేశారు. వీరితో పాటు ఇండియన్ సొసైటీ టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ డా.ఈశ్వరరెడ్డి, ఈసీ సభ్యులు డా.రవీంద్రబాబు పాల్గొన్నారు. వేడుకల్లో ఎస్వీయూకి చెందిన రిటైర్డ్ ఆచార్య ఎం.ఎం నాయుడుకు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ స్పాన్సర్ చేసిన లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో పుల్లారెడ్డి కాలేజీకి చెందిన కె.సాయిసుధ, ఉదయ్ కిరణ్‌లకు సైతం అవార్డులు దక్కాయి. కార్యక్రమంలో టీసీఎస్ అకడమిక్ రిలేషన్స్ మేనేజర్ శ్రీనివాస్ రామానుజన్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్): జాతీయ రహదారి గుత్తి పెట్రోల్ బంకు పై ఓవర్ బ్రిడ్జి హ్యాంగౌట్ హోటల్ వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శనివారం తెల్లవారు జామున ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బెంగళూరు వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందినట్లు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తెలిపారు. మృతుడికి 37 ఏళ్ల వయస్సు ఉంటుందని, లోయర్, ఆకు పచ్చ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెడికల్ కోడింగ్‌పై అవగాహన సదస్సు

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో మెడికల్ కోడింగ్ యొక్క ప్రాధాన్యత, ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆ కాలేజీ అకడమిక్ అడ్వైజర్ డా.ఆదిమూలపు సతీష్ పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం మెడికల్ కోడింగ్‌లో ఫార్మసీ విద్యార్థులకు చాలా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. సదస్సులో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, అకడమిక్ డీన్ డా.రాజ్‌కుమార్, న్యాక్ కో-ఆర్డినేటర్ రఘువీర్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

1న విశాఖలో విద్యార్థి కన్వెన్షన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): విశాఖ స్టీలు ప్లాంటు పరిరక్షణ, కడప స్టీలు ప్లాంటు నిర్మాణం కోసం నవంబర్ ఒకటో తేదీన విశాఖపట్నంలో నిర్వహించే విద్యార్థి కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విద్యార్థి కన్వెన్షన్‌కు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి హరీష్, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్‌డీఏ ప్రభుత్వం విశాఖ స్టీలు ప్రైవేటీకరణకు వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో పోరాటాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న ఇరు జట్లు

కర్నూలు (టౌన్) : సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎన్‌టీకే నాయక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమని చెప్పారు. ఆటలో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. సెయింట్ జోసఫ్ కళాశాల డీన్ పరిపాలన అధికారి వై.శౌరీలు రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం , శారీరక ధృడత్వం అలవడుతుందన్నారు. చదువులో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు తప్పనిసరి అన్నారు. గేమ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు. అనంతరం వైస్ చాన్సలర్ వాలీబాల్, సెపక్‌తక్రా జట్లను పరిచయం చేసుకొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాల డిగ్రీ కళాశాలల జట్లు హాజరయ్యాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ శాంత, సెపెక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలు :

సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలపై ఆర్‌యూ కళాశాల జట్టు 25-23, 25-10 పాయింట్ల తేడాతో, పత్తికొండ గవర్నమెంట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై ఎస్ఆర్‌కేడీసీ జట్టు 26-24, 25-16 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి

మల్లికార్జున వైన్ షాపును తరలించాలి

కర్నూలు(సెంట్రల్): మార్కెట్‌యార్డు సమీపంలో సుందరయ్య సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మల్లికార్జున వైన్ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.నగేష్, రాఘవేంద్ర శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇక్కడ సమీపంలో ఆసుపత్రి ఉంది. అలాగే మెయిన్ రోడ్డు కావడంతో నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఈక్రమంలో ఇక్కడ వైన్ షాపును ఏర్పాటు చేయడంతో రోడ్లపైనే తాగుబోతులు గుంపులు గుంపులుగా ఉంటుండడంతో విద్యార్థినులకు తీవ్ర ఆటంకంగా ఉందన్నారు. ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతుందని అధికారులు స్పందించి షాపును వేరే చోటుకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.

విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదు

కర్నూలు(సెంట్రల్):చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారాలు వేయడం సరికాదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు తిరుపాలు పేర్కొన్నారు. శనివారం ఆ సంఘం నాయకులు సీ క్యాంపులో నిరసన తెలిపారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోనని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలపై రూ. 6 వేలకోట్ల భారం వేశారన్నారు. వెంటనే పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. యూనిట్‌కు రూ. 1.21 అదనంగా 15 నెలలపాటు వసూలు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, విజయ్, గోపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం


కర్నూలు (టౌన్): స్థానిక సి.క్యాంపు రైతుబజార్ సమీపంలో ఉన్న మహిళా మార్టులో శనివారం మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు పీడీ నాగశివలీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అర్బన్ మార్కెట్‌లో 28 ఉత్పత్తులకు సంబంధించిన యూనిట్స్ వారు స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంచారన్నారు. సంఘ సభ్యులు తయారు చేసిన యూనిట్స్‌కు మంచి మార్కెట్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మెప్మా టౌన్ ప్రాజెక్టు టీపీఓ వెంకటలక్ష్మి, సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, టీఎంసీలు సుధాకర్, భారతి పాల్గొన్నారు.

గోవులపై దాడిని ఖండిస్తున్నాం

కర్నూలు కల్చరల్: గోవులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోనెగండ్ల గ్రామంలో గోవులపై జరిగిన అతి కిరాతకమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ స్పందించి దాడి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం


- ఓ వ్యక్తికి కిడ్నీ ఫెయిల్యూర్



దినేష్‌కుమార్‌తో డాక్టర్ నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్దార్థ్ హెరూర్క

కర్నూలు(హాస్పిటల్): తెలిసీ తెలియక ఆర్‌ఎంపీ వైద్యుడు చేసిన వైద్యం కారణంగా ఓ వ్యక్తి కిడ్నీ ఫెయిల్యూర్ అయి ఆసుపత్రి పాలయ్యాడు. అతనికి నగరంలోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు మెరుగైన వైద్యం అందించి ప్రాణం పోశారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు నగరానికి చెందిన దినేష్‌కుమార్ నాయక్ పది రోజుల నుంచి జ్వరం, ఒళ్లునొప్పులతో బాధపడుతూ సమీపంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడిని కలిశాడు. అతను ఇచ్చిన ఇన్‌ట్రా మస్కులర్ రైట్ హిప్ ఇంజెక్షన్ వల్ల కండరాలు ఇన్‌ఫెక్షన్‌కు గురై కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారి తీశాయి. ఫలితంగా మూత్రం నల్ల రంగులో వస్తుండటంతో కుటుంబసభ్యులు వెంటనే మెడికవర్ హాస్పిటల్‌లో చేర్పించారు. నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్దార్థ్ హెరూర్క అతడిని అత్యవసర విభాగంలో చేర్చి చికిత్స అందించారు. శరీరంలో సీపీకే లెవెల్ పెరిగిన కారణంగా మూత్రం నల్లగా రావడంతో ఐసీయూలో పది రోజుల పాటు ప్రత్యేక డయాలసిస్ చేశారు. కుళ్లిపోయిన కండరాలను జనరల్ సర్జన్ డాక్టర్ భార్గవ్ తీసివేశారు. అనంతరం అందించిన వైద్యం వల్ల దినేష్‌కుమార్ పూర్తిగా కోలుకున్నాడు. మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి లోకల్ ఆర్‌ఎంపీల దగ్గర గాకుండా నిపుణులైన వైద్యులచే చికిత్స చేయించుకోవాలన్నారు. సకాలంలో సరైన వైద్యం అందించడం వల్ల దినేష్‌కుమార్‌ను కాపాడగలిగామన్నారు.

భక్త కనకదాసు జయంతి అధికారికంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భక్త కనకదాసు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి పత్రం పంపామన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో సంఘం అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ అన్ని మండల కేంద్రాల్లో కూడా ఈ ఏడాది నుంచి ప్రభుత్వమే కనకదాసు జయంతిని నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. రాష్ట్రంలో 35 లక్షల ఓటర్లు ఉన్న కురువ కులస్థులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్రంలోని తిరుపతి, శ్రీశైలం, మహానంది, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో కనకదాసు భవనాలు నిర్మించాలన్నారు. సమావేశంలో నాయకులు కొత్తపల్లి దేవేంద్ర, కోశాధికారి కేసీ నాగన్న, ధనుంజయ, బీసీ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో వైద్యం వికటించి వ్యక్తి మృతి



లోకన్న(ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందారు. తెలంగాణా రాష్ట్రం అలంపూర్ తాలూకా భీమవరం గ్రామానికి చెందిన లోకన్న(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవారు. ఆయనకు వరిబీజం సమస్య ఉండటంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల చేరారు. జనరల్ సర్జరీ విభాగంలో వైద్యులు ఈ నెల 23వ తేదీన అతనికి వరిబీజం ఆపరేషన్ చేశారు. మరుసటిరోజు శుక్రవారం అతనికి ఫిట్స్ రావడంతో వార్డు నుంచి క్యాజువాలిటీకి తీసుకొచ్చారు. ఆయన ఆరోగ్యపరిస్థితి బాగాలేదని, ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాలని అక్కడే ఉన్న ఓ లేడీ డాక్టర్ చెప్పడంతో వారు నగరంలోని అమీలియో హాస్పిటల్‌కు రాత్రి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే లోకన్న మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్ల లోకన్న మృతి చెందాడని వారు ఆరోపించారు.

వడ్డీతో సహా బిల్లులు చెల్లించండి

ఆర్‌యూకు నోటీస్ జారీ చేసిన ఫర్నీచర్ కాంట్రాక్టర్

కర్నూలు కల్చరల్: రాయలసీమ వర్సిటీలోని న్యూలైబ్రరీ బిల్డింగ్‌కు ఫర్నీచర్ సప్లై చేసినా రూ.1.32 కోట్లు బిల్లులు సకాలంలో చెల్లించలేదని టెండర్ దక్కించుకున్న హర్యానా లైబ్రరీ ఫర్నీచర్స్, గీకెన్, హైదరాబాద్ కుసుమహర ఎంటర్ ప్రైజెస్ వారు ఎమ్ఎస్ఎమ్ఈ ఆక్ట్ 16 ప్రకారం వర్సిటీ అధికారులకు నోటీసులు ఇచ్చారు. మొత్తం బిల్లులతో పాటు దానికి సంబంధించి బ్యాంక్ వడ్డీ రేటుకు మూడు రెట్లు పెంచి వడ్డీ చెల్లించాలని అందులో పేర్కొన్నారు. ఈ లెక్కన వడ్డీతో కలిపి మొత్తం రూ. 2.02 కోట్లు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి వస్తుంది. ఈ విషయమై వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ నేను వీసీగా రాక ముందు ఫర్నీచర్ బిల్లులు నిలిపేశారని తెలుసు కానీ దానికి సంబంధించి రూ. 70 లక్షల వడ్డీ చెల్లించాలని నోటీస్ వచ్చినట్లు తనకు తెలియదన్నారు. కాంట్రాక్టర్ కానీ, లైబ్రరీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ కానీ దీని గురించి చర్చించ లేదన్నారు.